# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు






ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 05 | సంచిక : 365 | గురువారం 20 - 08 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2


## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య
# 27 సార్లు పొడిచారు

- నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడి
- జల్సాలు, డబ్బు కోసమే ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసుల వెల్లడి
- గతంలో మందలించడంతో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్న నిందితుడు
- 70 సీసీ కెమెరాలు పరిశీలించి ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసిన పోలీసులు
- నిందితుల నుంచి రూ. 1.54 లక్షల నగదు, ఐఫోన్ స్వాధీనం



**హైదరాబాద్ :** నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించిన స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. విలాసాలకు అలవాటు పడిన ఇద్దరు మైనర్ విద్యార్థులే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుల్లో ఒకరు ఆమెను ఏకంగా 27 సార్లు కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ కేసు వివరాలను వెల్లడించారు. - మిగతా 2 లో

## భారీ చిత్రాలకు కొత్త రూల్
## తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు



- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- ‘పెద్ది’, ‘రాజాసాబ్’ వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

**హైదరాబాద్ :** భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. - మిగతా 2 లో




## సీఎం రేవంత్‌పై
## కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

- పరకాల టికెట్‌పై రేవంత్‌ను ప్రశ్నించిన కొండా సుష్మిత
- రేవూరికి టికెట్ ఎలా ఖరారు చేస్తారని నిలదీత
- టికెట్లను అధిష్ఠానమే నిర్ణయిస్తుందని స్పష్టీకరణ
- కొండా మురళికి ఎమ్మెల్సీ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్న
- బీసీల పట్ల వివక్ష చూపుతున్నారని రేవంత్‌పై ఆరోపణలు

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ టికెట్ వ్యవహారం మరోసారి వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పిలుపునిచ్చారు. దీనిపై - మిగతా 2 లో

## రష్యాలో డ్రోన్ దాడి.. భారత వైద్య విద్యార్థికి గాయాలు

- రష్యాలోని ఉఫాలో డ్రోన్ దాడిలో భారత విద్యార్థికి గాయాలు
- బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో చదువుతున్న బాధితుడు
- విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రకటించిన భారత ఎంబసీ



**ఢిల్లీ :** రష్యా–ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో, రష్యాలోని ఉఫా నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక భారతీయ విద్యార్థి గాయపడ్డారు. ప్రస్తుతం బాధితుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స - మిగతా 2 లో

## ‘జమ్మూకశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం’



- అమెరికా రాయబారి సెర్గియో
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన అమెరికా రాయబారి సెర్గియో గోర్
- జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసిన అమెరికా ప్రతినిధి

**ఢిల్లీ :** జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పష్టం చేశారు. కేంద్రం, జమ్మూకశ్మీర్ యంత్రాంగం భద్రతను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ నేపథ్యంలోనే అమెరికా తన ప్రయాణ హెచ్చరికను మరోసారి సమీక్షించే అవకాశం ఉందని వెల్లడించారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో శ్రీనగర్‌లో భేటీ అనంతరం గోర్ మీడియాతో మాట్లాడారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత, అలాగే 2025లో - మిగతా 2 లో

## ప్రజానాడి




## 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

- రూ.9,450 కోట్లతో 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్
- బంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో 410 కి.మీ. మేర అదనపు రైల్వే లైన్లు



**ఢిల్లీ :** దేశంలో రైల్వే మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం - మిగతా 2 లో

## ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

- వైసీపీ అధినేత జగన్
- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



**అమరావతి :** కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ - మిగతా 2 లో

# ప్రజాసమస్యలు అసెంబ్లీలో చర్చిస్తేనే విలువ

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చిస్తే విలువ, గుర్తింపు
- అలాకాకుండా బయట కూర్చొని ఎంత మాట్లాడినా విలువ ఉండదు
- అసెంబ్లీ లాబీలో మీడియాతో చంద్రబాబు



**అమరావతి :** దేవాలయం వంటి అసెంబ్లీని ఓ పార్టీ మొత్తం బహిష్కరించడం చరిత్రలోనే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చిస్తే విలువ, గుర్తింపు ఉంటాయని, అలాకాకుండా బయట కూర్చొని ఎంత మాట్లాడినా ఏం విలువ ఉండదని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అసెంబ్లీ అనేది అత్యున్నత స్థానమని అలాంటి వేదికను ఓ పార్టీ బహిష్కరించడం తన రాజకీయ జీవితంలో చూడలేదన్నారు. ప్రజలు సభ్యుల్ని ఎన్నుకునేది తమ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడతారనేనని సీఎం అన్నారు.గతంలో 1978లో వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డిలు ఇద్దరే సభను అల్లాడించారని గుర్తు చేశారు. 1989–94 సమయంలో ఎన్టీఆర్ మధ్యలో కొన్ని రోజులు సభకు రాకపోయినా తామంతా పార్టీ తరఫున అసెంబ్లీలో ప్రజల కోసం పోరాడామని వివరించారు. 2019–24 మధ్య తాను సభలో సవాల్ చేసి బయటకు వచ్చినా తమ ఎమ్మెల్యేలు చివరి రోజు వరకు ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించారని వెల్లడించారు.గ్రూప్–1 అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే సభకు రాకుండా బయట కూర్చొని డీఎస్సీపై - మిగతా 2 లో

## ‘విశాఖపట్నం’ ఇక ‘ఏఐ పట్నం’
## డేటా సెంటర్లపై అనుమానాలు వద్దు

- రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్
- విశాఖ డేటా సెంటర్లపై అపోహలు వ్యాప్తి చేస్తున్నారన్న మంత్రి
- డేటా సెంటర్లకు పోలవరం పారిశ్రామిక వాటా నుంచి నీటిని కేటాయిస్తామని స్పష్టత
- థర్మల్ పవర్ ప్లాంట్‌తో పోలిస్తే డేటా సెంటర్ల నీటి వినియోగం చాలా తక్కువని వివరణ
- నీటి వనరులపై ప్రభావం చూపుతాయని పౌర సంఘాలు, విపక్షాల ఆందోళన



**అమరావతి :** విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లపై కొందరు ఉద్దేశపూర్వకంగా అపోహలు సృష్టిస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. డేటా సెంటర్లకు అవసరమైన నీరు, విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందని, దీనివల్ల ప్రజలకు గానీ, సాగునీటికి గానీ ఎలాంటి ఇబ్బంది ఉండదని - మిగతా 2 లో

# సంపాదకీయం

## దారికొచ్చిన జార్ఖండ్!



కేంద్ర విద్యామంత్రి రాజీనామా కోరుతూ వినూత్న తరహా నిరసనలతో, నిరాహార దీక్షలతో ఢిల్లీ జంతర్ మంతర్‌లో ఊహించని విజయం సాధించిన జెన్ జీ... రాంచీలో సైతం ఘన విజయం సాధించింది. జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్--కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (జేఎస్ఎస్‌సీ--సీజీఎల్) పరీక్షను రద్దు చేయటానికి ఎట్టకేలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అంగీకరించింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటనతో ఉద్యమకారుల శిబిరం ఆనందోత్సాహాలతో పొంగిపోగా... రాష్ట్రంలో గత పన్నెండేళ్ల నుంచీ జరిగిన పరీక్షల్లో అవకతవకలు జరిగాయనీ, వాటిపై కూడా చర్యలు తీసుకోబోతున్నామనీ ఆయన చెప్పటం వేలాదిమంది ఉద్యోగుల జీవితాలను ప్రశ్నార్థకం చేసింది. ఆ నియామకాలన్నీ రద్దు చేస్తారా... చేస్తే దానికి అనుసరించే విధానమేమిటన్న ప్రశ్న ఇప్పుడందర్నీ వేధిస్తోంది. వీరుగాక తమ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారున్నారు. అన్నీ పూర్తయి నియామకాల కోసం ఎదురుచూస్తున్న మరో 1,975 మంది వీరికి అదనం.తగిన విద్యార్హతలు గలవారంతా ప్రభుత్వోద్యోగం కోసం వెంపర్లాడతారు. ప్రయత్నం ఫలిస్తే జీవితంలో శాశ్వతంగా స్థిరపడిపోవచ్చని ఆశపడతారు. ఆ ఉద్యోగ భద్రత అలాంటిది మరి. కానీ ప్రభుత్వోద్యోగాలు వందల్లో ఉంటే, పోటీపడేవారు లక్షల్లో ఉంటారు. అందుకే తమ చదువులు ఎంతవరకూ పనికొస్తాయన్న భయాందోళనలు అభ్యర్థుల్లో సహజంగానే ఉంటాయి. ఈ పరిస్థితిని శిక్షణ సంస్థలు సొమ్ముచేసుకుంటాయి. లక్షలమంది వేలకు వేలు ఖర్చుచేస్తారు. తీరా ప్రశ్నపత్రాలు లీకయ్యాయని తెలిశాక అలాంటివారి గుండె రగిలిపోదా? ఈ ఆగ్రహావేశాలనుంచే జెన్ జీ ఉద్యమం పురుడు పోసుకుంది. కేంద్ర స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష అయినా, ఇప్పుడు జార్ఖండ్‌లో జరిగిన ఉద్యోగ నియామకాలైనా వివాదాస్పదంగా మారింది అందుకే. సమాజంలో, జీవితంలో అనిశ్చితి అలుముకున్న వర్తమానంలో అన్యాయం జరిగిందనుకున్నప్పుడు ఉద్యమాలు పోటెత్తడం అనివార్యమని గ్రహించక, యువత డిమాండ్లను అవగాహన చేసుకోక తమకు అలవాటైన పద్ధతుల్లో ఉద్యమాల్ని అణిచేద్దామని ఢిల్లీలోనూ, రాంచీలోనూ పాలకులు ప్రయత్నించారు. రెండుచోట్లా పాలక కూటములు వేర్వేరు. అవి పరస్పరం ప్రత్యర్థి పక్షాలు. అయినా వారి చర్యల్లో సారూప్యత కనబడటం గమనించదగ్గది. రెండుచోట్లా చివరకు పాలకులు వాస్తవం గ్రహించక తప్పలేదు.జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పోటీ పరీక్షలన్నిటినీ టీఎస్సార్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేటు లిమిటెడ్(టీడీపీఎల్) నిర్వహిస్తూ వచ్చింది. ఈ సంస్థ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) కోసం ఇంతవరకూ 10 పరీక్షలు, జెఎస్ఎస్‌సీకి 5 నిర్వహించింది. వీటిద్వారా బ్లాక్ సప్లయ్ ఆఫీసర్ మొదలుకొని డిప్యూటీ కలెక్టర్, టీచర్, సివిల్ జడ్జి, ప్రాసిక్యూటర్ వరకూ అనేక పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో త్రిశంకు స్వర్గంలో పడ్డామనీ, జనం దృష్టిలో నేరగాళ్లుగా మిగులుతామనీ వారంతా గొల్లుమంటున్నారు. తమ నిర్లక్ష్యంతో, కొన్నిసార్లు కుమ్మక్కుతో యువత ఆశయాలపై చన్నీళ్లు చల్లుతున్నామని పాలకులు గుర్తించటం లేదు.ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం మొండిగా ప్రవర్తిస్తోంది. టీడీపీ నేతలు క్రీడా ధ్రువీకరణ పత్రాలివ్వటం, సర్కారు ఉద్యోగాలు పంచడం వింత. జాతీయస్థాయి పతక గ్రహీతలు కూడా వారిముందు బలాదూరే! కూటమి భాగస్వామిగా ఉన్న బీజేపీ కళ్లు మూసుకుంది. జార్ఖండ్‌లో ఉద్యమవీరుల పార్టీగా ప్రతిష్ఠ పొందేందుకు నానారకాల ప్రయత్నం చేసిన పక్షమే అక్రమాలెక్కడంటూ దబాయింపులకు దిగుతోంది. దగాపడిన డీఎస్సీ అభ్యర్థులు చానెళ్లలో తమ గోడు వినిపిస్తుంటే... ప్రశ్నపత్రాల లీక్ మొదలుకొని ర్యాంకుల ప్రకటన, నియామకాల వరకూ సర్వం సందేహాలకు తావిస్తుంటే టీడీపీకి 'తందాన తాన' పక్షంగా మిగిలింది. పరీక్ష నిర్వహణ వ్యవస్థలో ఉన్న వ్యక్తే ఫస్ట్ ర్యాంకర్ అని తెలిసి గుట్టుచప్పుడు కాకుండా అతగాడి పేరు డేటానుంచి మాయం చేయటం దేన్ని సూచిస్తోంది? జార్ఖండ్‌ను చూశాకైనా బుద్ధి తెచ్చుకుని తప్పు గ్రహించక పోతే కూటమి పక్షాలకు ఏపీ జనం టోకున బుద్ధి చెప్పటం ఖాయం.

## ప్రజాసమస్యలు అసెంబ్లీలో చర్చిస్తేనే విలువ

**మొదటిపేజీ తరువాయి -** బురద చల్లుతున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం కోత పెట్టిన బీసీ రిజర్వేషన్లను తామే పునరుద్ధరించామని, ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయని చంద్రబాబు అన్నారు.పార్టీ నాయకుడు అసత్యాలు ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, అతని మాటలను ప్రజలు పట్టించుకోవడం కూడా లేదని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా మరోవైపు మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని విచారణ జరిపించాలంటూ వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనతో శాసనమండలి కార్యకలాపాలకు మూడో రోజు కూడా అంతరాయం కలిగింది. వైఎస్సార్సీపీ సభ్యుల తీరుపై మంత్రులు పార్థసారథి, నాందెడ్ల మనోహర్, అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ఆర్డర్‌లో పెట్టాలంటూ మండలి ఛైర్మన్‌ని మంత్రులు కోరే సందర్భంలో కాసేపు వాడీవేడి చర్చ జరిగింది.

## ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

**మొదటిపేజీ తరువాయి -** ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## రష్యాలో డ్రోన్ దాడి.. భారత వైద్య విద్యార్థికి గాయాలు

**మొదటిపేజీ తరువాయి -** పొందుతున్నారని, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.ఉఫాలోని బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న ఈ విద్యార్థిపై డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) తక్షణమే స్పందించింది. గాయపడిన విద్యార్థితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సదరు విద్యార్థికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచారు.గత మూడు రోజులుగా రష్యా భూభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, మాస్కోకు సుమారు 1,200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కీలక పారిశ్రామిక నగరం ఉఫా లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. ఇక్కడి చమురు శుద్ధి కర్మాగారంపై సైతం దాడులు జరిగినట్లు వార్తలు వెలువడుతున్నాయి.

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు




**మొదటిపేజీ తరువాయి -** టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది.ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# 'విశాఖపట్నం' ఇక 'ఏఐ పట్నం'.. డేటా సెంటర్లపై అనుమానాలు వద్దు



**మొదటిపేజీ తరువాయి -** అసెంబ్లీ వేదికగా ఆయన హామీ ఇచ్చారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సుదీర్ఘంగా సమాధానమిచ్చారు.డేటా సెంటర్లకు నీటి కేటాయింపులపై వస్తున్న ఆందోళనలు అనవసరమని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "గోదావరి నుంచి ఏటా సగటున 3,000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. విశాఖలో 6.5 గిగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు చేసినా, వాటికి అవసరమయ్యేది కేవలం 3 టీఎంసీల నీరే. పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా విశాఖకు తరలిస్తున్న నీటిని తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు కేటాయించాం. ఈ పారిశ్రామిక వాటా నుంచే డేటా సెంటర్లకు నీరు అందిస్తాం. నగర ప్రజల తాగునీటి వ్యవస్థ నుంచి ఒక్క చుక్క కూడా మళ్లించం. పైగా, ఇప్పుడు ఎయిర్ కూలింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు అందుబాటులోకి రావడంతో నీటి వినియోగం గణనీయంగా తగ్గుతోంది" అని వివరించారు. రాబోయే 18 నెలల్లో పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా విశాఖకు తాగునీరు అందిస్తామని, డేటా సెంటర్ల కోసం ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.విద్యుత్ సరఫరా, ఛార్జీల విషయంలోనూ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఉందని లోకేశ్ అన్నారు. ఒక గిగావాట్ థర్మల్ ప్లాంట్‌కు, డేటా సెంటర్‌కు వినియోగించే నీటి కన్నా పది రెట్లు ఎక్కువ అవసరమని, కానీ దాని గురించి ఎవరూ మాట్లాడరని ఆయన చురక అంటించారు. "డేటా సెంటర్లు తప్పనిసరిగా 70% గ్రీన్ ఎనర్జీనే వాడాలని స్పష్టమైన నిబంధన పెట్టాం. సౌర, పవన విద్యుత్‌ను వినియోగించుకునేలా ప్రోత్సహిస్తున్నాం. ప్రధాని మోదీ తెచ్చిన 'వన్ నేషన్-వన్ గ్రిడ్' విధానంతో రాయలసీమలో ఉత్పత్తి అయ్యే పునరుత్పాదక శక్తిని దేశంలో ఎక్కడికైనా పంపవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే పలుమార్లు చెప్పారు. పైగా ఈ ఏడాది 13 పైసలు తగ్గించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిది" అని లోకేశ్ గుర్తుచేశారు.డేటా సెంటర్ల రాకతో విశాఖ స్వరూపమే మారిపోతుందని, ఇది కేవలం కొన్ని ఉద్యోగాలకే పరిమితం కాదని మంత్రి తెలిపారు. "గూగుల్ వంటి దిగ్గజ సంస్థ విశాఖకు వస్తుండటంతో దాని చుట్టూ బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకో సిస్టమ్) ఏర్పడుతుంది. కూలింగ్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఫైబర్ తయారీ వంటి అనుబంధ పరిశ్రమలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, ముఖ్యంగా రాయలసీమకు వస్తున్నాయి. ఒక్క కూలింగ్ ఎకోసిస్టమ్ వల్లే రాయలసీమలో 20,000 ఉద్యోగాలు రాబోతున్నాయి. లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ వంటి రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి" అని ఆయన పేర్కొన్నారు. కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పినట్లుగా, విశాఖపట్నం ఇక 'ఏఐ పట్నం'గా మారబోతోందని, ఏఐకి సంబంధించిన కోర్సులతో ఒక అమెరికన్ విశ్వవిద్యాలయం కూడా ఇక్కడ ఏర్పాటు కానుందని వెల్లడించారు.1995లో కంప్యూటర్లపై ఇలాంటి దుష్ప్రచారమే చేశారని, అప్పుడు ప్రభుత్వం వెనక్కి తగ్గి ఉంటే హైదరాబాద్ నేటి ఐటీ హబ్‌గా ఎదిగేది కాదని లోకేశ్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి జరుగుతున్నప్పుడు పర్యావరణంపై కొంత భారం ఉంటుందని, కానీ దాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. రాజకీయ లబ్ధి కోసం చేసే దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను కోరారు.

# 'జమ్మూకశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం'

**మొదటిపేజీ తరువాయి -** పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో అమెరికా రాయబారి జమ్మూకశ్మీర్‌లో ప్రత్యేకంగా పర్యటించడం ఇదే తొలిసారి.'జమ్మూకశ్మీర్‌కు తొలిసారి రావడం ఆనందంగా ఉంది. ఇది ఎంతో అందమైన ప్రాంతం. ఒమర్‌తో భేటీ చాలా స్నేహపూర్వకంగా, సానుకూలంగా సాగింది. సమావేశంలో చర్చించిన అంశాలను వాషింగ్టన్, ఢిల్లీలోని సంబంధిత వర్గాలతో ముందుకు తీసుకెళ్తున్నాం. జమ్మూకశ్మీర్‌ను మరింత సురక్షితంగా మార్చేందుకు కేంద్రం, స్థానిక ప్రభుత్వం అద్భుతమైన చర్యలు తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికను సమీక్షించనున్నాం. ప్రస్తుతం అమెరికా జమ్మూకశ్మీర్‌కు లెవల్-4 డోంట్ ట్రావెల్ హెచ్చరికను జారీ చేసింది. ఈ హెచ్చరికను తక్కువ స్థాయికి మార్చే అంశాన్ని పరిశీలిస్తాం. అమెరికన్లు జమ్మూకశ్మీర్ అందాలను, ఇక్కడి అవకాశాలను ఆస్వాదించేందుకు రావాలని కోరుకుంటారు. అయితే ఈ విషయంలో శ్రీనగర్ నుంచే ఎలాంటి తుది ప్రకటన చేయలేను. అమెరికా ఎప్పటికప్పుడు తన ప్రయాణ హెచ్చరికలను సమీక్షిస్తుంది. జమ్మూకశ్మీర్‌లో భద్రత పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తాజా పరిస్థితులను పరిశీలిస్తాం' అని సెర్గియో గోర్ పేర్కొన్నారు.అమెరికా-జమ్మూకశ్మీర్ మధ్య ఆర్థిక సంబంధాలను మరింత విస్తరించడంపై ఒమర్ అబ్దుల్లాతో చర్చించినట్లు గోర్ తెలిపారు. పర్యాటకం, ఉద్యానవన రంగం, నూతన ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చ జరిగినట్లు ఒమర్ అబ్దుల్లా కూడా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. అమెరికా రాయబారితో జరిగిన భేటీ సంతోషకరంగా సాగిందని పేర్కొన్న ఒమర్, జమ్మూకశ్మీర్, అమెరికా మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు ఈ చర్చలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.గోర్ పర్యటనకు ముందు కూడా ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. చాలా కాలం తర్వాత అమెరికా రాయబారి జమ్మూకశ్మీర్‌కు వస్తున్నారని, ఆయనతో మాట్లాడతానని, ఆయన అభిప్రాయాలను తెలుసుకోవాలని ఉందని అన్నారు. అయితే జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన అంతర్గత వ్యవహారాలు పూర్తిగా భారత్‌కు సంబంధించినవేనని స్పష్టం చేశారు. తమ సమస్యలను మరో దేశ రాయబారికి ఫిర్యాదు చేయడం తనకు అలవాటు లేదన్నారు. తమ సమస్యలు వాషింగ్టన్‌లో పరిష్కారం కావని, మన సొంత ప్రభుత్వం ద్వారానే పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు.జమ్మూకశ్మీర్, లద్ధాఖ్‌లకు రెండు రోజుల పర్యటన కోసం ఆయన బుధవారం శ్రీనగర్ చేరుకున్నారు. గోర్ గురువారం లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. శ్రీనగర్‌లో వాణిజ్య, ఇతర సంఘాల సభ్యులతో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులపై అమెరికా రాయబారి సానుకూల వ్యాఖ్యలు చేయడం, ప్రయాణ హెచ్చరికను తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా 2019 తర్వాత తొలిసారి అమెరికా రాయబారి జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం, కేంద్రం-స్థానిక యంత్రాంగం భద్రతా చర్యలను ప్రశంసించడం చర్చనీయాంశంగా మారింది. ఇక ఇటీవల ఉగ్రవాద నిరోధక చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ సెర్గియో గోర్ చర్చించారు. అలాగే భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతున్న సమయంలో ఆయన పర్యటన జరగడం గమనార్హం.

## హార్ముజ్‌పై ఇరాన్ పట్టు సడలుతోందా

**మొదటిపేజీ తరువాయి -** గత వారం హర్మూజ్ జలసంధిని కనీసం 95 నౌకలు దాటాయి. అంతకుముందు వారంలో ఈ సంఖ్య 118గా ఉంది. అయితే నౌకలు ఎంచుకుంటున్న మార్గంలో కీలకమైన మార్పు కనిపించింది. గత రెండు వారాల్లో హర్మూజ్ దాటిన నౌకల్లో దాదాపు 80 శాతం ఒమన్ వైపు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నాయి.ఈ మార్గాన్ని ఐక్యరాజ్యసమితి అనుమతించింది. అయితే దీన్ని ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇరాన్ హెచ్చరికలను పట్టించుకోకుండా అమెరికా రక్షణపై నమ్మకంతో నౌకలు ఈ మార్గంలో సాగుతున్నాయి.ఇరాన్ సూచించిన మార్గాన్ని నౌకలు ఎంచుకోకపోవడంతో ఆ దేశానికి మరో దెబ్బ తగిలింది. జలసంధి మీదుగా వెళ్లే నౌకల నుంచి టోల్ వసూలు చేసే అవకాశం తగ్గింది. మధ్యప్రాచ్య దేశాలు కూడా ఈ విధానాన్ని అంగీకరించేందుకు ఆసక్తి చూపడం లేదు.సౌదీ అరేబియా, కువైట్, యూఏఈ వంటి చమురు ఉత్పత్తి దేశాలు భారీ చమురు నౌకలను హర్మూజ్ మీదుగా పంపిస్తున్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్ దాటిన తర్వాత అక్కడి నుంచి ఇతర నౌకలకు చమురును బదిలీ చేస్తున్నాయి.ఇరాన్ దాడులను తప్పించుకునేందుకు కొన్ని భారీ నౌకలు తమ ట్రాన్స్‌పాండర్లను ఆపివేస్తున్నాయి. దీంతో వాటి కదలికలను సాధారణ ట్రాకింగ్ వ్యవస్థలు కూడా గుర్తించలేకపోతున్నాయి. ఈ రహస్య రాకపోకలను 'డార్క్ షిప్పింగ్'గా పిలుస్తున్నారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్ జలసంధికి సంబంధించి కీలక ప్రకటన చేశారు. జలసంధిలో ఉంచిన సముద్రపు మైన్లను తొలగించామని తెలిపారు. నౌకాదళ దిగ్బంధం కొనసాగుతోందని స్పష్టం చేశారు.హర్మూజ్ జలసంధి నుంచి సాధారణంగా ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో దాదాపు ఐదో వంతు సాగుతుంది. తాజాగా అమెరికా అంచనాల ప్రకారం.. హర్మూజ్ మీదుగా, ప్రత్యామ్నాయ మార్గాల గుండా కలిపి రోజుకు సుమారు 1.5 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరుగుతోంది. యుద్ధానికి ముందు ఉన్న రోజువారీ 2 కోట్ల బ్యారెళ్ల సగటుకు ఇది చేరువ కావడం గమనార్హం.

## 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

**మొదటిపేజీ తరువాయి -** తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ భేటీలో రూ.9,450 కోట్ల అంచనా వ్యయంతో 410 కిలోమీటర్ల మేర నాలుగు నూతన రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం దక్కింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లోని 8 జిల్లాల వ్యాప్తంగా ఈ రైల్వే నెట్‌వర్క్ విస్తరించనుంది.ఈ నెట్‌వర్క్‌లో భాగంగా ఖరగ్‌పూర్ - భద్రక్, భద్రక్ - హరిదాస్‌పూర్, గూడూరు - గుమ్మిడిపూండి, కటక్ - పారాదీప్ మార్గాల్లో 3, 4వ రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. 2030-31 నాటికి పూర్తి కానున్న ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు రూ.6,448 గ్రామాలకు రవాణా అనుసంధానత మెరుగవనుంది. అంతే కాకుండా ప్రయాణికులకు మరింత వేగవంతమైన, సురక్షితమైన సేవలు అందనున్నాయి. వీటికి తోడు, బిహార్‌లో భారత్-నేపాల్ సరిహద్దులకు కనెక్టివిటీని పెంచేలా ముజఫర్‌పూర్-సీతామర్హి-సోన్‌బర్సా మధ్య ఉన్న చీఎ-22ని రూ.3,590 కోట్లతో నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ భారీ ప్రాజెక్టులతో ఆయా ప్రాంతాల్లోని సుమారు 60 లక్షల జనాభా ఉన్న 6,448 గ్రామాలకు రవాణా సదుపాయాలు మెరుగవ్వనున్నాయి. సరకు రవాణా సామర్థ్యం అదనంగా 76 మిలియన్ టన్నులకు పెరిగి పర్యాటకం, పారిశ్రామికాభివృద్ధి మరింతగా పుంజుకోనున్నాయని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచారు

**మొదటిపేజీ తరువాయి -** ఈ నెల 11న కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేసేందుకు ఇద్దరు విద్యార్థులు పథకం రచించారు. అందులో ఒకరు మాస్క్ ధరించి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. అయితే, ప్రమాదవశాత్తు మాస్క్ జారిపోవడంతో రూపారెడ్డి అతడిని గుర్తుపట్టారు. దీంతో భయాందోళనకు గురైన నిందితుడు, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. 27 సార్లు పొడిచి చంపిన అనంతరం, ఆమె ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.ఈ కేసు దర్యాప్తు కోసం పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సుమారు 70 సీసీటీవీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఎస్పీ తెలిపారు. పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత గైర్హాజరైన వారిలో ఇద్దరు విద్యార్థులు విపరీతంగా డబ్బు ఖర్చు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.గతంలో హాస్టల్‌లో ఉన్న సమయంలో నిందితుడి వద్ద నగదు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి అతడిని మందలించారు. అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్న నిందితుడు, ప్రధానంగా డబ్బు కోసమే ఈ హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుల నుంచి రూ. 1.54 లక్షల నగదు, ఒక ఐఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నోట్లపై ఉన్న రక్తపు మరకలను ల్యాబ్‌లో పరీక్షించగా, అవి మనిషి రక్తమేనని నిర్ధారణ అయింది. నిందితులు మైనర్లు కావడంతో వారిని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరుస్తామని ఎస్పీ వివరించారు.

## సీటు రగడ.. సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి -** మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్రంగా స్పందించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇస్తామని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని సుష్మిత నిలదీశారు. పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో టికెట్లను పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, నేతలు కాదని అన్నారు.తన తండ్రి కొండా మురళిని రేవంత్‌రెడ్డి ఎందుకు పక్కన పెడుతున్నారని సుష్మిత ప్రశ్నించారు. కొండా మురళి సాధారణ నేత కాదని, కింగ్ మేకర్ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో తొలుత కోరింది కొండా దంపతులేనని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్ అయిన తర్వాత రేవంత్‌రెడ్డి తమ ఇంటికి వచ్చారా? అని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సుష్మిత పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సంగారెడ్డి టికెట్‌ను అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పిన సీఎం.. పరకాల విషయంలో మాత్రం తానే ఎలా నిర్ణయం చెబుతారని నిలదీశారు.యువతకు టికెట్లు ఇవ్వాలని చెబుతూ రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తామని చెప్పడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం పదవిని కాపాడుకోవాలంటే నిబద్ధత అవసరమని వ్యాఖ్యానించారు. బీసీల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఆరోపించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా సుష్మిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మరో 'పొంగు' ఉందని, ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి ఎవరో తెలియని పరిస్థితి ఉందంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.

# అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా 60 కి.మీ. చొరబాటు

# ఖండించిన కేంద్ర మంత్రి రిజిజు

- భారత్-చైనా మధ్య సరిహద్దు ఇంకా స్పష్టంగా రూపుదిద్దుకోలేదన్న కేంద్రమంత్రి
- కాంగ్రెస్ ప్రభుత్వాలు సరిహద్దుల్లో మౌలిక వసతులు నిర్మించలేదని వెల్లడి
- తప్పుడు వీడియోలతో సైన్యం స్థైర్యాన్ని దెబ్బతీయొద్దని వ్యాఖ్య
- సరిహద్దు ప్రాంతాల్లో ఐటీబీపీ పెట్రోలింగ్ బలోపేతం చేశామన్న కిరణ్ రిజిజు



అరుణాచల్ ప్రదేశ్‌లోకి చైనా సైన్యం 60 కిలోమీటర్ల మేర చొచ్చుకొచ్చిందంటూ వస్తున్న వార్తలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. ఈ కథనాలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని స్పష్టం చేశారు. అరుణాచల్‌లోని అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో వాస్తవాధీన రేఖను దాటి చైనా సైనికులు లోపలికి వచ్చినట్లు స్థానికులు ఆరోపించిన నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ, "భారత్-చైనా మధ్య అరుణాచల్ ప్రదేశ్‌లో సుదీర్ఘ సరిహద్దు ఉంది. క్షేత్రస్థాయిలో ఈ సరిహద్దును ఇప్పటికీ పూర్తిస్థాయిలో, స్పష్టంగా నిర్ణయించలేదు. టిబెట్‌తో మన సరిహద్దును గతంలో సరిగ్గా గుర్తించకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు పెరిగాయి" అని వివరించారు. స్థానికుల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెబుతూనే, బంగ్లాదేశ్‌కు చెందిన పాత వీడియోలను సామాజిక మాధ్యమాల్లో చూపిస్తూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. ఇటువంటి చర్యలు సరిహద్దుల్లో పహారా కాస్తున్న సైనిక బలగాల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పనలో గత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కిరణ్ రిజిజు ఈ సందర్భంగా ఆరోపించారు. "సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు నిర్మించకపోవడమే తమ విధానమని నాటి రక్షణ మంత్రి ఏకే ఆంటోనీ పార్లమెంటులోనే చెప్పారు. దీనివల్ల చైనా మనకంటే ముందే అక్కడే మౌలిక సదుపాయాలను నిర్మించుకోగలిగింది. 2014లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రోడ్లు లేని మారుమూల ప్రాంతాల్లోనూ యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టాం" అని తెలిపారు. సరిహద్దులు స్పష్టంగా లేని కొన్ని ఎత్తయిన ప్రాంతాల్లో చైనా గతంలోనే శిబిరాలు ఏర్పాటు చేసుకుందని, అంతేకానీ భారత గ్రామాలను ఆక్రమించుకోలేదని రిజిజు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఇండో-టిబెటన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) గస్తీని మరింత బలోపేతం చేసినట్లు వెల్లడించారు.

ప్రజా మంటలు

గురువారం 20- 08 - 2026

## ఎల్కతుర్తిలో ఘనంగా విశ్వ బ్రాహ్మణుల బోనాలు





**ఎల్కాతుర్తి ఆగస్టు 19 ప్రజా మంటలు :** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో విశ్వ బ్రాహ్మణుల పోచమ్మ బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన విశ్వ బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆటపాటలతో పోచమ్మ బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వారు అమ్మవారిని ప్రార్థించారు. రైతులకు మంచి పంటలు పండి, గ్రామాల్లో సుభిక్షం నెలకొనాలని ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు, కందుకూరి రాజన్న ఉపాధ్యక్షులు, కందుకూరి శ్రీనివాస్ డైరెక్టర్లు, సంఘ సభ్యులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

## సోమవంశీ ఆర్య క్షత్రియ సమాజ్ ఉన్నతి మండల్ ముఖ్య సమావేశం



**సికింద్రాబాద్,ఆగస్ట్ 19 (ప్రజామంటలు):** సోమవంశీ ఆర్య క్షత్రియ సమాజ్ ఉన్నతి మండల్ అధ్యక్షుడు దివంగత శ్యామ్ రావు డిల్లికర్ మరణం పట్ల సంస్థ కార్యవర్గం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సికింద్రాబాద్‌లోని పద్మారావు నగర్, గోల్డెన్ పెటల్ బ్యాంకెట్ హాల్‌లో కార్యవర్గం అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దివంగత అధ్యక్షుడు డిల్లికర్‌తో పాటు సమాజానికి విశేష సేవలు అందించిన ఇతర దివంగత పెద్దలకు సభ్యులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం పరిపాలనా కొనసాగింపు, నిర్వహణను పటిష్టం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. 'రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్' అధికారిక రికార్డులలో సమాజ్ వివరాలను క్రమబద్ధీకరించే చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చేందుకు ఎం. భీష్మ చారి (దీ.ాషి., ూా.దీ.)ని మధ్యవర్తిగా (ఆర్బిట్రేటర్) నియమిస్తూ కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు సభ్యుల మధ్య స్వయం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజ కార్యకలాపాలను డిజిటలైజ్ చేసే దిశగా కొత్త సభ్యత్వ దరఖాస్తు ఫారమ్‌లు, రసీదు పుస్తకాలను నాయకులు విడుదల చేశారు. బ్యాంకింగ్ లావాదేవీల కోసం చీజుఖీ/=+ూ వివరాలతో పాటు సులభతర చెల్లింపుల కోసం ప్రత్యేక ఖు× స్కానర్‌ను అందుబాటులోకి తెచ్చారు. సమాజ భవిష్యత్తు ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా నిధుల సేకరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, సమాజ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల్ ముఖ్య ప్రతినిధులు ప్రదీప్ దిల్కర్, అమర్‌నాథ్ చవాన్, దీపక్ బాగేలికర్, ఉదయ్ నవగిరే, సుభాష్ హెండే, విజయ్ దిల్కర్, అజయ్ నవగిరే, వినోద్ లాండ్గే, నర్సింగ్ రావు దిల్కర్, ధనరాజ్ ఉబాడే, ఓం ప్రకాశ్ పుట్లే ,తదితరులు పాల్గొన్నారు.

## లాడ్జి వ్యవహారం - పోలీస్‌స్టేషన్‌కు ఇరువురు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగష్టు 19:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో తన భార్య ఇతరులతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని తెలుసుకొని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన జగిత్యాలలో కలకలం రేపింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు లాడ్జికి చేరుకుని అక్కడ ఉన్న భార్యతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

## జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఏకగ్రీవం

### అధ్యక్షులుగా కమటాల శ్రీనివాస్



**జగిత్యాల టౌన్, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 19:** జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు వారికి పత్రములు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా కమటాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా కప్పల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా ఎలిమిల్ల చంద్రకాంత్, సహాయ కార్యదర్శిగా సామ సునీల్ కుమార్ ఎన్నికైనట్టు ఎన్నికల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. హాజరైన వ్యాపార ప్రముఖుల సమక్షంలో ఎన్నికల అధికారి పబ్బ శ్రీనివాస్, ఎన్నికల కన్వీనర్ పల్లెర్ల రాజయ్య తో పాటు ఉప ఎన్నికల అధికారులు శ్రీనివాసమూర్తి, పాత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. హాజరైన సభ్యుల హర్షధ్వానాల మధ్య వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్తక సంఘం ఎన్నికలు జగిత్యాల పట్టణములోని పలు సంఘాలకు మార్గదర్శకంగా ఉంటూ ఏకగ్రీవంగా జరగడం సభ్యుల ఐకమత్యానికి సంఘ బలోపేతానికి సంఘ శ్రేయస్సుకు తార్కానంగా పేర్కొన్నారు. రాబోవు కాలంలో సంఘ సభ్యుల శ్రేయస్సుకు కృషి చేస్తామని ఎన్నికైన కార్యవర్గం పేర్కొంది పూర్తిస్థాయి కార్యవర్గాన్ని పలు అనుబంధాల సంఘాల ఆలోచనలకు అనుగుణంగా ఏర్పరచుకొని త్వరలో నూతన కార్యవర్గ పరిచయ వేదికను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## పారిశుధ్య కార్మికులకు యూనిఫార్మ్‌ల పంపిణీ



**వెల్గటూర్ ఆగష్టు 19 ( ప్రజా మంటలు ) :** ధర్మపురి పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణ ప్రజల ఆరోగ్యం పరిశుభ్రత కోసం నిత్యం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఈరోజు యూనిఫార్మ్‌లను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ గారితో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి వేముల నాగలక్ష్మి గారు పారిశుధ్య కార్మికులకు యూనిఫార్మ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి వేముల నాగలక్ష్మి గారు మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఎండ వానలను లెక్కచేయకుండా నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు యూనిఫార్మ్‌లను సద్వినియోగం చేసుకుని విధుల్లో భాగంగా తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పట్టణ పరిశుభ్రతతో పాటు కార్మికుల భద్రత సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లు కోఅప్షన్ సభ్యులు సిబ్బంది పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు బీజేపీని తీసుకెళ్లాలి- భైరి శంకర్ ముదిరాజ్

### బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి: శ్రీకాంత్ యాదవ్





**ఎల్కతుర్తి ఆగష్టు 19 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి, ఆగష్టు 19: ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు భైరి శంకర్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భైరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, గడపగడపకు బీజేపీ పార్టీని తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరించి, బీజేపీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని అన్నారు. ఉచిత రేషన్ బియ్యం, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జన్‌ధన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు శక్తి కేంద్రాలను క్రియాశీలం చేసి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని కోరారు. రానున్న రోజుల్లో ఎల్కతుర్తి మండలంలో బీజేపీని మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని అన్నారు. మండల అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. ప్రతి బూత్‌లో కమిటీలను మరింత క్రియాశీలం చేసి, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున నిరంతరం పోరాటం చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యలపై అవసరమైన సందర్భాల్లో నిరసనలు, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రజల పక్షాన బీజేపీ నిలబడాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేష్, ఎల్కతుర్తి మండల ప్రభారి లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల కుమార్, జిల్లా కార్యదర్శి పృథ్వీరాజ్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షులు మోహన్ నాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి సామల సురేష్ రెడ్డి, మండల పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, వివిధ మోర్చాల నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ గీత పై జిల్లాఎస్పీకి పిర్యాదు

### ముందస్తు ఫిర్యాదు పట్ల ఎస్ఐ నిర్లక్ష్యం..
### - సర్పంచ్‌పై దాడి
### సారంగాపూర్ మండల ఎస్ఐ తీరుతో జంకుతున్న ప్రజా పతి నిధులు
### ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపాలని మహేష్ డిమాండ్




**సారంగాపూర్, ప్రజా మంటలు, ఆగస్ట్ 19 :** తనను చంపుతానంటూ గొడ్డలితో తిరుగుతున్న వ్యక్తిపై ముందస్తుగానే పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు తగిన చర్యలు తీసుకోక పోవడం వల్లే తనపై దాడి జరిగిందని రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్ తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మహేష్ కథనం ప్రకారం, తన తమ్ముడు బాస నాగేందర్ ఈ నెల 14న గ్రామంలో గొడ్డలి వెంట పెట్టుకొని తిరుగుతూ తనను చంపుతానని బహిరంగంగా బెదిరించాడు. మరుసటి రోజు స్వాతంత్ర్య దినోత్సవ జెండా వందనం కార్యక్రమంలో తనను చంపుతానని కూడా పలువురి సమక్షంలో హెచ్చరించినట్లు తెలిపారు. ఈ విషయంపై అదే రోజు సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ పాకాల గీత కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, తన ప్రాణానికి ముప్పు ఉందని స్పష్టంగా వివరించినట్లు తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన రసీదు కూడా తన వద్ద ఉందన్నారు. అయితే, ముందస్తు హెచ్చరిక ఉన్నప్పటికీ తగిన నివారణ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తాను ముందే చెప్పినట్లుగానే ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో తనపై దాడి జరిగిందని పేర్కొన్నారు. ముందస్తు ఫిర్యాదును సకాలంలో పరిశీలించి చర్యలు తీసుకుని ఉంటే ఈ ఘటనను నివారించే అవకాశం ఉండేదని ఆయన అన్నారు. దాడి అనంతరం తన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినప్పటికీ, తనపై జరిగిన దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన బందెల రవీందర్ తోపాటు తనపైనా కేసులు నమోదు చేయడం వెనుక ఉద్దేశ్యంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలు తనతో పాటు గొడవను అడ్డుకున్న వారిని ఇబ్బందులకు గురిచేయడానికేనని ఆరోపించారు. ఇదిలా ఉండగా, గత ఐదు నెలలుగా తమ అన్నదమ్ముల మధ్య భూ వివాదంపై సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు చర్చలు, పంచాయతీలు నిర్వహించారని తెలిపారు. ఈ క్రమంలో ఒప్పంద పత్రాలు తయారుచేసి వాటి ప్రతులను పోలీస్ స్టేషన్‌లోనే ఉంచుకున్నారని ఆరోపించారు. ఈ అంశంపైనా సమగ్ర విచారణ జరపాలని కోరారు. ముందస్తు ఫిర్యాదు అందుకున్న తర్వాత ఎస్ఐ తీసుకున్న చర్యలేమిటి? దాడి జరగకుండా ఎందుకు నివారించలేకపోయారు....? అనంతరం తనపైనా, దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తిపైనా కేసులు నమోదు చేయడానికి గల కారణాలేమిటి? అనే అంశాలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి విచారణ జరపాలని మహేష్ డిమాండ్ చేశారు. తనకు భవిష్యత్తులో ఎటువంటి ప్రాణహాని కలగకుండా తక్షణమే పోలీసు రక్షణ కల్పించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేదా పక్షపాతం జరిగి ఉంటే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీని కోరారు. ఆగస్టు 14న సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ముందస్తు ఫిర్యాదు రసీదు ప్రతిని కూడా ఎస్పీకి సమర్పించినట్లు రేచపల్లి సర్పంచ్ బాస మహేష్ తెలిపారు.

## జిల్లాలో 102 సెల్ ఫోన్ లు చోరీ

### చోరికి గురైన సెల్ ఫోన్ ల విలువ రూ.21 లక్షలు
### రికవరీ చేయించి బాధితులకు అప్పగించిన జిల్లాఎస్పీ






**జగిత్యాల జిల్లా బ్యూరో, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 19:** సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సి.ఈ.ఐ.ఆర్. ద్వారా తిరిగి పొందవచ్చని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోగొట్టుకున్న, చోరి గురైన 102 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని బుధవారం బాధితులకు అప్పగించారు. వాటి విలువ రూ.21 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సి.ఈ.ఐ.ఆర్. వెబ్సైట్లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుల్ లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సి.ఈ.ఐ.ఆర్. పోర్టల్ ప్రారంభమైన నాటి నుండి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2024 ( రూ.4.5 కోట్ల విలువగల ) ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఫోన్లలో ఉన్న వ్యక్తిగత ఆధారం గురించి నష్టాన్ని కాజేస్తుందన్నారు. ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. దొంగిలించిన ఫోన్లను నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సి.ఈ.ఐ.ఆర్. వెబ్సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఎవరైనా సెకండ్ హాండ్ ఫోన్ లు కొనే ముందు అప్లికేషన్లో అట్టి ఫోన్ యొక్క వివరాలను అనగా ఐయంఈఐ నంబర్లు నమోదు చేసి చెక్ చేసుకోవాలని కోరారు. తద్వారా అట్టి ఫోన్ ఆ ఫోన్ యొక్క స్టేటస్ తెలుస్తుందన్నారు. అదేవిధంగా ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లో రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సి.ఈ.ఐ.ఆర్. టీం ను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డ్ అందజేశారు.

### సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెరిగిన సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా సైబర్ మోసగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను బురిడి కొట్టించి డబ్బులు దండుకుని మోసాలకు పాల్పడుతున్నారని ఇలాంటి వాటిపై అందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేక్ ఫోన్ కాల్స్ కు స్పందించకపోవడమే మంచిదని, ఇంటర్నేషనల్ కాల్స్, కొత్త నంబర్ల నుంచి ఫోన్ వస్తే అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అజ్ఞాత వ్యక్తుల కు ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని సూచించారు. ఒకవేళ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబర్ 1930 ఫోన్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా బాధితులు తమ యొక్క ఫోన్ పోయినా విధానాన్ని వారు ఫోన్ పోయినప్పుడు అవలంబించిన విధానాన్ని తెలియజేశారు. సాంకేతికతను ఉపయోగించి పోయిన సెల్ఫోన్లను తిరిగి కనిపెట్టి తమకు ఇచ్చినందుకు బాధితులు ఎస్పీ గారికి చాలా ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ యొక్క అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్.ఐ కృష్ణ , సి.ఈ.ఐ.ఆర్. టీం హెడ్ కానిస్టేబుల్ మహుముద్, కానిస్టేబుల్లు మల్లేశం, అజర్, అనూష, ప్రశాంత్, పాల్గొన్నారు.

## ఆర్టీఐ దరఖాస్తుల వల్లనే ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు ఆగిపోయాయా...?

### బుగ్గారం లబ్ధిదారుల్లో భయాందోళనలు తొలగించాలి
### తక్షణమే అధికారిక ప్రకటన జారీ చేయాలి
### ఎంపిడివో కు సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి విజ్ఞప్తి



**బుగ్గారం, (ప్రజా మంటలు) 2026,ఆగస్టు 19 :** జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామంలో ఆర్టీఐ దరఖాస్తుల కారణంగానే 40 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రావాల్సిన బిల్లులు నిలిచిపోయాయని కొన్ని దినపత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతూ సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి బుధవారం బుగ్గారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కోరుతూ ఆ కార్యాలయంలో ఎంపివో బింగి సురేష్ కు వినతిపత్రం అందజేశారు. ఆర్టీఐ దరఖాస్తుల వల్లే ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఆగిపోయాయనే ప్రచారం వాస్తవమా..., కాదా... అనే విషయంపై అధికారికంగా తక్షణమే స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ముఖ్యంగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు బహిరంగ ప్రకటనతో పాటు లిఖితపూర్వకంగా కూడా బుగ్గారం లబ్ధిదారులకు పూర్తి వివరంగా తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆర్టీఐ దరఖాస్తుల కారణంగానే బిల్లులు నిలిచిపోయినట్లయితే, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను కూడా ప్రజలకు బహిర్గతం చేయాలని చుక్క గంగారెడ్డి కోరారు. అదే సమయంలో ఈ ప్రచారాలు అసత్యమైనవిగా తేలితే..., వాటిని ఎవరు, ఏ ఉద్దేశంతో ప్రచారం చేశారో గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొంతమంది వ్యక్తులు వారి స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం, వారిపై ఉన్న ఆరోపణలు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలను కప్పిపుచ్చుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఉపయోగించుకుంటున్నారనే సమాచారం ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆర్టీఐ కార్యకర్తల వల్లే తమ బిల్లులు రావడం లేదంటూ లబ్ధిదారుల్లో అపోహలు కల్పించి, వారిని ఆర్టీఐ కార్యకర్తలు, ఉద్యోగులు, అధికారులపైకి వెళ్లే విధంగా రెచ్చగొడుతున్నారనే అంశాన్ని కూడా పరిశీలించాలని ఆయన కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని చుక్క గంగారెడ్డి కోరారు. అసత్య ప్రచారాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులను గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇకపై ఇలాంటి తప్పుడు ప్రచారాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆయన బుగ్గారం ఎంపిడివో యం.సుమంత్ ను కోరారు. ఎంపివో బింగి సురేష్ విజ్ఞాపన పత్రాన్ని స్వీకరించారు.

## 2 వేల మంది అన్‌ఫిట్ దరఖాస్తుదారులకు న్యాయం చేయాలి- కవిత





**హైదరాబాద్, ఆగస్టు 19 (ప్రజా మంటలు):** సింగరేణిలో అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 2 వేల మంది కార్మికులను మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కారమయ్యే వరకు ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని కోరారు. హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, మాజీ మంత్రి బోడ జనార్ధన్‌తో కలిసి విడుదల చేసిన వీడియో సందేశంలో కవిత ఈ డిమాండ్లు చేశారు. గత నెలలో కార్మిక సంఘాల హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం మెడికల్ బోర్డు ఏర్పాటు చేసిందని, అయితే దానిని ఒక్క నెలకే పరిమితం చేయడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యే వరకు బోర్డును కొనసాగించాలని స్పష్టం చేశారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని కవిత హెచ్చరించారు.

### అలియాస్ పేర్ల సమస్య పరిష్కరించాలి

సింగరేణి కార్మికుల వారసులకు ఉద్యోగాలు లభించడంలో అడ్డంకిగా మారిన అలియాస్ పేర్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కవిత కోరారు. ఉద్యోగాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న యువకులకు స్పష్టమైన హామీ ఇవ్వకుండా దీక్ష విరమింపజేయడం సరికాదన్నారు. ఈ సమస్యపై కూనంనేని సాంబశివరావు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని కవిత విమర్శించారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆయన కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఉద్యోగాల కోసం పోరాడుతున్న యువకులకు హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ మద్దతు ఉంటుందని తెలిపారు.

### ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు చేపడుతున్న ఆందోళనలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కవిత ప్రకటించారు. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు, పెండింగ్ డీఏల చెల్లింపు, హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు, ప్రమోషన్లు, బదిలీలు తదితర సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కవిత సూచించారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ ఆర్టీసీ బస్సు రూట్, స్టాప్ లలోనూ మార్పులు

**ప్రధాన బస్సు రూట్లలో స్వల్ప మార్పులు చేసిన ఆర్టీసీ**

**గైడ్‌లైన్స్ ప్రకారం ప్రయాణికులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి**

**127, 222 47, 10 బస్సుల ప్రయాణ మార్గాలను వెల్లడించిన అధికారులు**

జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా అమలు చేస్తున్న వన్-వే నిబంధనల దృష్ట్యా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్సు రూట్లలో స్వల్ప మార్పులు చేసింది. మార్పు చేసిన బస్సు స్టాప్‌ల వివరాలను ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. టీజీఎస్ ఆర్టీసీ ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారం ప్రయాణికులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వన్-వే నిబంధన అమలు చేస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం ఆర్టీసీ సైతం తమ బస్సు రూట్లలో, బస్సు స్టాప్‌లల్లో స్వల్ప మార్పులు చేయాల్సి వచ్చిందని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బంజారాహిల్స్, రోడ్ నంబర్ 45, పరిసర ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులు, మారిన బస్సు రూట్లను, స్టాప్‌లను గమనించి తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సు సర్వీసులను నడిపించేందుకు కూడా తగిన ఏర్పాట్లు చేస్తుందని అధికారులు స్పష్టం చేశారు.మారిన బస్సు సర్వీసులు 127ఖ కొండాపూర్-కోఠి,



222ూ పటాన్‌చెరు-కోఠి, 47ూ మణికొండ-సికింద్రాబాద్/జేబీఎస్, 10 కొండాపూర్-సికింద్రాబాద్.రూట్ నంబర్ 127 కోఠి - కొండాపూర్.వెళ్లే మార్గం : కోఠి లక్డీకాపూల్ మసబ్‌ట్యాంక్ పెన్షన్ హౌస్ ఎమ్మెల్యే కాలనీ అపోలో ఆస్పత్రి రోడ్డు నంబర్ 45 మాదాపూర్ పీఎస్ మీదుగా కొండాపూర్ వెళుతుంది.వచ్చే మార్గం : కొండాపూర్ మాదాపూర్ పీఎస్ రోడ్డు నంబర్ 45 జర్నలిస్ట్ కాలనీ జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ అన్నపూర్ణ స్టూడియో ఎల్వీ ప్రసాద్ బసవతారకం హాస్పిటల్ బీఆర్ఎస్ భవన్ ఎమ్మెల్యే కాలనీ పెన్షన్ హౌస్ మాసబ్‌ట్యాంక్ మీదుగా కోఠి వెళుతుంది.రూట్ నంబర్ 222 కోఠి - పటాన్‌చెరు.అప్ జర్నీ కోఠి లక్డీకాపూల్ మసబ్ ట్యాంక్ నాగార్జున సర్కిల్ ఎల్వీ ప్రసాద్ బసవతారకం హాస్పిటల్ బీఆర్ఎస్ భవన్ ఎమ్మెల్యే కాలనీ ఒమేగా అపోలో ఆస్పత్రి జర్నలిస్ట్ కాలనీ జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ పెద్దమ్మ గుడి మాదాపూర్ పీఎస్ మీదుగా పటాన్ చెరుకు చేరుకుంటుంది.డౌన్ జర్నీ పటాన్‌చెరు మాదాపూర్ పీఎస్ పెద్దమ్మ గుడి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ అన్నపూర్ణ స్టూడియోస్ ఎల్వీ ప్రసాద్ నాగార్జున సర్కిల్ మాసబ్ ట్యాంక్ లక్డీకాపూల్ మీదుగా కోఠి వరకు వెళుతుంది.రూట్ నంబర్ 47ూ : సికింద్రాబాద్/జేబీఎస్ నుంచి మణికొండ.అప్ జర్నీ సికింద్రాబాద్ బేగంపేట నాగార్జున సర్కిల్ ఎల్వీ ప్రసాద్ బసవతారకం హాస్పిటల్ బీఆర్ఎస్ భవన్ ఎమ్మెల్యే కాలనీ ఒమేగా అపోలో ఆస్పత్రి ఫిల్మ్ నగర్ దర్గా మీదుగా మణికొండ వెళుతుంది.డౌన్ జర్నీ : మణికొండ పంచవటి కాలనీ దర్గా ఫిల్మ్ నగర్ జర్నలిస్ట్ కాలనీ జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ అన్నపూర్ణ స్టూడియోస్ ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ మసీద్ పంజాగుట్ట పీఎస్ ఆర్.జె. కాలేజీ పోలీస్ లైన్ ప్లాజా మీదుగా సికింద్రాబాద్ వెళుతుంది.రూట్ నంబర్ 10ఎ : సికింద్రాబాద్-శ్రీ కొండాపూర్.అప్ జర్నీ : సికింద్రాబాద్ బేగంపేట మైత్రివనం యూసఫ్‌గూడ ఎక్స్‌రోడ్స్ వెంకటగిరి నవయుగా పెద్దమ్మ గుడి మాదాపూర్ పోలీస్ స్టేషన్ మీదుగా కొండాపూర్ చేరుకుంటుంది.డౌన్ జర్నీ : కొండాపూర్ పెద్దమ్మ గుడి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెంకటగిరి యూసఫ్‌గూడ మైత్రివనం బేగంపేట మీదుగా సికింద్రాబాద్ వెళుతుంది.

# ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపల్ హత్య కేసులో బిగ్ ట్విస్ట్ చంపింది విద్యార్థులేనా

**రూపారెడ్డికి చెందిన స్కూల్ విద్యార్థులే నిందితులని పోలీసుల అనుమానం**

**ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, మరో విద్యార్థి కోసం గాలింపు**

**ప్రిన్సిపల్ రూపారెడ్డిపై మృతదేహంపై 27 కత్తిపోట్లు గుర్తించిన పోలీసులు**

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీకి చెందిన నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.రూపారెడ్డి, ఈ నెల 11న దారుణ హత్యకు గురయ్యారు. ముగ్గురు పూర్వ, ప్రస్తుత విద్యార్థులే ఈ దారుణానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. సుమారు 80 మందిని విచారించిన అనంతరం, కొండమల్లేపల్లి మండలంలోని రెండు తండాలకు చెందిన విద్యార్థులు ఈ ఘాతుకానికి పాల్పడారని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు, ముగ్గురిపై అనుమానంతో ఇబ్రహీంపట్నం వద్ద మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రూపారెడ్డి హత్య అనంతరం ఆ విద్యార్థులు సుమారు రూ.4 లక్షల నగదు చోరీ చేసినట్లు అనుమానిస్తున్నారు.అసలేం జరిగిందంటే నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో రూపారెడ్డి స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తించేవారు. భర్త రాజేందర్ రెడ్డితో కలిసి జేబీ కాలనీలో నివాసం ఉండేవారు. అయితే రూపారెడ్డికి కుటుంబానికి హైదరాబాద్‌లో సొంత ఇల్లు ఉంది. కుమారుడు అభినవ్ రెడ్డి హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు తరచూ హైదరాబాద్‌కు వెళ్తుంటారు.గత శనివారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో రూపారెడ్డి భర్తతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. భర్తకు అక్కడ పని ఉండటంతో ఆమె ఆగస్టు 11న ఉదయం ఒక్కరే కొండమల్లేపల్లికి తిరిగి వచ్చారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విధులకు హాజరయ్యారు. సాధారణంగా సాయంత్రం 6.30 గంటల వరకు పాఠశాలలోనే ఉండేవారని తెలుస్తోంది. ఆగస్టు 11వ తేదీన తమ ఇంటికి స్నేహితులు వస్తున్నారని చెప్పి, సాయంత్రం 5.25 గంటల సమయంలోనే పాఠశాలకు సమీపంలోని తన ఇంటికి వెళ్లారు.పలుమార్లు కాల్ చేసినా స్పందన లేదు : ఆ తర్వాత ఆమె నుంచి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం అందలేదు. రాత్రి సమయంలో కూడా ఆమె ఫోన్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. ఆగస్టు 12న భర్త



రాజేందర్‌రెడ్డి రూపారెడ్డికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన ఆయన తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారికి కాల్ చేసి ఇంట్లోకి వెళ్లి చూడాలని కోరారు. వారు ఇంటికి వెళ్లి ఎంత పిలిచినా లోపల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో విషయాన్ని రాజేందర్‌రెడ్డికి తెలియజేశారు.ఈ నేపథ్యంలో తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న చింతపల్లి ఎస్సై రాంమూర్తికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. ఎస్సై స్థానికులతో కలిసి ఇంటికి వెళ్లి పరిశీలించగా రూపారెడ్డి రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని ఆమె భర్తకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# వెలిగొండ నిర్వాసితులకు ఊరట నేడు మరో 1600 కుటుంబాలకు రూ.200 కోట్ల పంపిణీ

**రైతులకు చెక్కులు పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు**

**ఈ నెలాఖరుకల్లా నల్లమలసాగర్ జలాశయానికి నీటి విడుదల**

**జలాశయం కింద 11 గ్రామాలు మునక 7,321 కుటుంబాల తరలింపు**

దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ నల్లమలసాగర్ (వెలిగొండ) ప్రాజెక్టును త్వరలో ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ నెలాఖరుకల్లా జలాశయానికి నీళ్లు విడుదల చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ప్రాజెక్టు కోసం భూములిచ్చి, ఊళ్లను త్యాగం చేస్తున్న నిర్వాసితులకు పరిహారం అందజేసే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా బుధవారం 1,600 కుటుంబాలకు రూ.200 కోట్ల మేర పరిహారాన్ని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.సీఎం చేతుల మీదుగా చెక్కుల పంపిణీ : వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొంతమంది రైతులకు స్వయంగా పరిహారం చెక్కులు పంపిణీ చేస్తారు. ఈ విషయాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే తొలిసారి నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ అందుతోందని చెప్పారు. ఇప్పటి వరకు 2,565 కుటుంబాలకు సుమారు రూ.318 కోట్లను చెల్లించారు. సోమవారంలోపు మిగతా కుటుంబాలకూ ప్యాకేజీ సొమ్ములు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం మరో 2,865 కుటుంబాలకు బిల్లులు అప్‌లోడ్ అయ్యాయి. మిగిలిన



1,891 కుటుంబాలకు కూడా బిల్లుల ప్రక్రియ చురుగ్గా సాగుతోంది.ముంపునకు 11 గ్రామాలు నల్లమలసాగర్ జలాశయం పూర్తైతే సుమారు 15 లక్షల మంది దాహార్తి తీరుతుంది. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే ఈ జలాశయం నిర్మాణం వల్ల ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 11 గ్రామాలు జలసమాధి కానున్నాయి. పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల, కాటమరాజుతండా, కలనూతల, చింతలముడిపి, సుంకేశుల గ్రామాలు మునిగిపోతాయి. మార్కాపురం రూరల్ మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువుతండా, అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, కృష్ణానగర్, సాయినగర్, రామలింగేశ్వరపురం గ్రామాలు జలాశయంలో కలిసిపోతాయి. దీంతో ఏకంగా 7,321 కుటుంబాలు తమ సొంత ఊళ్లను ఖాళీ చేస్తున్నాయి.ఎవరికి ఎంతంటే : మొత్తం నిర్వాసితుల్లో 3,961 కుటుంబాల కోసం ప్రభుత్వం ఏడు పునరావాస కాలనీలను సిద్ధం చేసింది. వీరికి ప్యాకేజీతో పాటు ఇళ్ల స్థలాలు ఇవ్వనుంది. కులాల వారీగా ఈ ప్యాకేజీలు నిర్ధారించారు. ఎస్టీలకు రూ.13.01 లక్షలు, ఎస్సీలకు రూ.12.76 లక్షలు, బీసీ, ఓబీసీలకు రూ.11.76 లక్షల చొప్పున పరిహారం అందుతుంది. ఈ నిధులతో ఆయా కుటుంబాలు ఇళ్లను నిర్మించుకోనున్నాయి. ఇళ్ల స్థలాల కోసం దేవరాజుగట్టు కాలనీలో భూసేకరణ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే అక్కడ 54 ఎకరాలు సేకరించి, లేఅవుట్‌ను సర్కారు సిద్ధం చేసింది. మరో 15 ఎకరాల సేకరణను వేగవంతం చేసింది.వన్ టైం సెటిల్‌మెంట్ దిశగా : మిగతా 3,360 కుటుంబాలు వన్ టైం సెటిల్‌మెంట్ (ఏకకాల పరిష్కారం - ఓటీఎస్) విధానానికి మొగ్గుచూపాయి. వీరికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు బదులు నగదు రూపంలో ఒక్కో కుటుంబానికి రూ.12.50 లక్షల చొప్పున ప్యాకేజీ చెల్లిస్తోంది. నిర్మాణ ఖర్చులు ఇస్తే తామే ఎక్కడో ఒకచోట ఇళ్లు కట్టుకుంటామని పలు కుటుంబాలు కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, తరతరాలుగా నివసిస్తున్న ఊళ్లను వీడుతున్న నిర్వాసితులు తాత్కాలిక నివాసాల కోసం నానా పాట్లు పడుతున్నారు. ఎక్కువ మంది అద్దె ఇళ్ల కోసం వెతుక్కుంటుండగా, మరికొందరు తమ బంధువుల ఇళ్లలో తలదాచుకునేందుకు బరువెక్కిన హృదయాలతో పయనమవుతున్నారు.

# త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

**రాష్ట్రంలో విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ**

**శ్రీవారి దర్శనం తర్వాత తిరుమలలో రాజకీయ పార్టీపై ప్రకటన**

త్వరలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నట్టు మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రకటించారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుకను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలిపారు.త్వరలో రాజకీయ ప్రణాళిక: దేశం సుభిక్షంగా ఉండాలని, ఎల్‌నినో ప్రభావం లేకుండా సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు ప్రశాంతంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఈ నెలలోనే తదుపరి రాజకీయ ప్రణాళికను చెబుతానని వెల్లడించారు. విజయవాడలో మీడియా ప్రతినిధులతో తన కొత్త పార్టీ గురించి అన్ని వివరాలు చెబుతానన్నారు.విజయసాయి రెడ్డి వైఎస్సార్సీపీని వీడి కొత్త పార్టీ పెట్టబోతున్నారనే ప్రచారం కొంతకాలంగా సాగుతుండగా, తిరుమల వేదికగా ఆయన చేసిన ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా పెను సంచలనం నమోదైంది. కొత్త పార్టీ పేరు, ఎజెండా, విధివిధానాలు ఎలా ఉండబోతోందనే అంశంపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.గతంలోనూ కీలక వ్యాఖ్యలు: అయితే జులైలో మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని గతంలో ప్రకటించిన విజయసాయిరెడ్డి తాజాగా కొత్త పార్టీ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చారు. ప్రజా పక్షంగా పనిచేస్తూ వారి గొంతుకగా నిలిచేలా పార్టీని తీర్చిదిద్దుతానని చెప్పారు. రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీ అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు వాస్తవ పరిస్థితిని గుర్తించి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. త్వరలో మీడియా రంగంలోకి కూడా వస్తానని తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన పూర్తి ప్రణాళికను ఈ నెలలోనే వెల్లడిస్తానని విజయసాయిరెడ్డి చెప్పారు.విజయసాయిరెడ్డి గతేడాది రాజ్యసభ ఎంపీ పదవికి, రాజకీయాలకు రాజీనామా చేశారు. అప్పట్లో తాను ఇకపై ఏ పార్టీలో చేరనని, కేవలం వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించారు. కానీ



ఇప్పుడు అనూహ్యంగా సరికొత్త రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. వైఎస్ కుటుంబంలో మూడు తరాలతో దాదాపు నాలుగు దశాబ్దాలుగా విజయసాయిరెడ్డికి అనుబంధం ఉంది. అలాంటి నేత ఇప్పుడు వైఎస్సార్సీపీకి గుడ్‌బై చెప్పి, సరికొత్త పార్టీతో పొలిటికల్ రీ-ఎంట్రీ ఇస్తుండటం ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఏఈ కుటుంబం ఆత్మహత్య కేసు వెలుగులోకి సౌజన్య లేఖలు, సాధిక్ అకృత్యాలు

**ఇంజినీర్ కుమార్తెను మభ్యపెట్టి కుటుంబం మొత్తానికి వేధింపులు**

**తన భర్తకు ఖాన్ విషమిచ్చి చంపేసినట్లు లేఖలో రాసిన సౌజన్య**

**సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో సాధిక్‌ఖాన్‌పై కేసు నమోదు**

కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ తిల్లపూడి నూకరాజు కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. రైఫిల్ షూటింగ్ శిక్షకుడు షేక్ సాధిక్ ఖాన్ వేధింపులే ఈ దారుణానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. తాజాగా ఈ కేసులో మరో దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది. 45 రోజుల క్రితం నూకరాజు అల్లుడు జగదీశ్వరరెడ్డి అనారోగ్యంతో చనిపోలేదని, అతనికి సాధిక్ విషమిచ్చి హత్య చేశాడని సౌజన్య రాసిన లేఖ లభ్యమవడంతో కథనం కీలక మలుపు తిరిగింది.లేఖల్లో సంచలన ఆరోపణలు: తన భర్త జగదీశ్వరరెడ్డికి సాధిక్ విష పదార్థమిచ్చి హత్య చేశాడని సౌజన్య ఆరోపించినట్లు తెలిసింది. తన ప్రైవేటు ఫొటోలను అడ్డుపెట్టుకుని బెదిరించేవాడని, ఆస్తులు, బంగారం, నగదు, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకుని వేధించేవాడని ఆమె లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. తన మాట వినకపోతే తండ్రి నూకరాజుతోపాటు కుటుంబ సభ్యులందరినీ చంపేస్తానని బెదిరించేవాడని ఆరోపించారు. ఇస్లాంలోకి మారాలని సైతం ఒత్తిడి చేసినట్లు పేర్కొన్నట్లు తెలిసింది. నూకరాజు రాసిన మరణ వాం గ్మూలం, సౌ జన్య లేఖ, ప్రాణా లతో బయట పడి న పదేళ్ల కార్తికే య‌రెడ్డి ఇ చ్చిన సమా చారం ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సౌజన్య లేఖను ఆమె ఇంటి వద్ద స్కూటర్ డిక్కీలో ఉంచినట్లు కార్తికేయ చెప్పడంతో పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు.జగదీశ్వరరెడ్డి మృతిపైనా అనుమానాలు: జులై 2న జగదీశ్వరరెడ్డి మృతి చెందారు. తాజాగా ఆయన మృతిపై అనుమానాలు వ్యక్త మవడంతో తండ్రి భాస్కరరెడ్డి కాకినాడ జిల్లా పోలీసులను ఆశ్రయించారు. సాధిక్ ప్రమేయంపై విచారణ జరపాలని కోరారు. దీంతో సర్పవరం




పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసుతోపాటు మరో ఐదు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.పరారీలో సాధిక్ - 5 బృందాలతో గాలింపు: కుటుంబం గోదావరిలోకి దూకిన విషయం తెలియగానే సాధిక్ కాకినాడ నుంచి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలి.. రైలులో ప్రయాణిస్తూ ఇతరుల ఫోన్ నుంచి కుటుంబ సభ్యులు, ఓ న్యాయవాదికి ఫోన్ చేసినట్లు సమాచారం. కాకినాడ జిల్లా నుంచి మూడు, తూర్పుగోదావరి జిల్లా నుంచి రెండు ప్రత్యేక బృందాలు అతడి కోసం గాలిస్తున్నాయి. నూకరాజు కారులో లభించిన ఫోన్ల కాల్‌డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. వాటి ఆధారంగా సాధిక్ కుట్రలు, ఇతరుల ప్రమేయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఆ కుటుంబంలో అల్లకల్లోలం: నూకరాజు కుటుంబం గతంలో కుమారుడిని రోడ్డు ప్రమాదంలో కోల్పోయింది. జులై 2న అల్లుడు జగదీశ్వరరెడ్డి మృతి చెందారు. తాజాగా నూకరాజు కుటుంబం గోదావరిలోకి దూకడంతో విషాదం మరింత ముదిరింది. నూకరాజు మృతదేహం లభించగా భార్య మీనా, కుమార్తె సౌజన్య ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, మత్స్యకారులు, పోలీసులు డ్రోన్ల సాయంతో నదిలో విస్తృతంగా గాలిస్తున్నారు.షూటింగ్ అకాడమీలోనూ ఆరోపణలు: సాధిక్ షూటింగ్ శిక్షణకు వచ్చే బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించేవాడని కొందరు విద్యార్థినులు ఆరోపించినట్లు సమాచారం. ప్రత్యేక శిక్షణ పేరుతో ఇతరులు లేని సమయంలో అకాడమీకి రావాలని చెప్పేవాడని, శిక్షణ సమయంలో అనుచితంగా తాకేవాడని వారు పేర్కొన్నట్లు తెలిసింది. ఈ ఆరోపణలపైనా పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. కేసులో సాధిక్ అరెస్టుతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# విశ్వంలో తాజాగా బయటపడ్డ వింత ఆకృతి

**ఏకంగా 10 వేల కోట్ల సూర్యుళ్ల స్థాయిలో వెలుగు . విశ్వంలో తాజాగా బయటపడ్డ వింత ఆకృతి**

**జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోపు ద్వారా వెలుగులోకి . హైదరాబాద్ మూలాలున్న రోహన్ నాయుడి పరిశోధనల ఘనత**



విశ్వంలో మనకు అంతుచిక్కని విషయాలు ఎన్నో ఉంటాయి. వాటిని కనుక్కొనేందుకే ఖగోళ శాస్త్రవేత్తలు కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంటారు. ఆ నేపథ్యంలోనే తాజాగా విశ్వంలో కనీవినీ ఎరుగని ఓ భారీ ఆకృతి వెలుగులోకి వచ్చింది. దానిని అమెరికా శాస్త్రవేత్తల బృందం గుర్తించింది. రోదసిలో ఉన్న జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోపు (జేడబ్ల్యూఎస్టీ) ద్వారా బయటపడింది. ఇది సౌర కుటుబం కన్నా పెద్దదిగా ఉంది. ఏకంగా 10 వేల కోట్ల సూర్యుళ్ల స్థాయిలో వెలుగుతోంది. దీనిని కొత్తరకం ఖగోళ వస్తువుగా వర్గీకరించాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక్కడ విశేషం ఏంటి అంటే ఈ అమెరికా బృందానికి హైదరాబాద్‌లో జన్మించిన రోహన్ నాయుడు నేతృత్వం వహించారు. రోహన్ నాయుడుపూర్తి వివరాలు ఇవే తొలినాటి విశ్వానికి సంబంధించిన గెలాక్సీల కోసం అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)కి చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. అలా గాలిస్తున్న తరుణంలోనే పరిశోధకులకు ఈ ఆకృతి తారసపడింది. మొదట ఇది ఎర్ర చుక్కలా కనిపించింది. కానీ జేడబ్ల్యూఎస్టీ ద్వారా దీన్ని నిశితంగా పరిశీలించాక అసలు విషయం బయటపడింది. దాని ప్రకాశవంతమైన వెలుగులు చూసి అది సాధారణ నక్షత్రం కాదని శాస్త్రవేత్తలు ఓ నిర్ణయానికి వచ్చారు.బిగ్ బ్యాంగ్ ఏర్పడినా కొద్ది కాలానికే : అయితే దీని వెలుగులు చూసి శాస్త్రవేత్తలు మరింత క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే దాని ఆకృతి ఏ గెలాక్సీ, కృష్ణబిలంతో సరిపోలడం లేదని తెలిసింది. దాంతో అది విశ్వం ఆవిర్భావానికి కారణమైన బిగ్ బ్యాంగ్ పరిణామం ఏర్పడిన కొద్దికాలానికే రూపుదాల్చిందని భావిస్తున్నారు. ఇలాంటి ఖగోళ వస్తువులను కృష్ణబిల నక్షత్రాలుగా వర్గీకరించాలని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు.ఆ వస్తువులో ఏముంది : ఆ వింత ఖగోళ వస్తువులో సూర్యుడి కన్నా లక్ష రెట్లు భారీగా ఉన్న కృష్ణబిలం ఉండొచ్చని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. దీనికి ఎంఓఎం-బీహెచ్-1 అని పేరు పెట్టారు. ఆ వస్తువు చుట్టూ ఒక హైడ్రోజన్ వాయు వలయం ఉండొచ్చని పేర్కొన్నారు. దాంతో అది సౌర కుటుంబమంతా పెద్దగా ఉండే నక్షత్రంలా కనిపిస్తోందని వివరించారు. అయితే మాములు తారలు న్యూక్లియర్ ఫ్యూజన్ ద్వారా శక్తిని పొందుతే ఇది మాత్రం తన లోపలికి వచ్చి పడుతున్న పదార్థాల ద్వారా శక్తిని ఒడిసిపడుతుండొచ్చని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ ఖగోళ వస్తువులో ప్రధానంగా హైడ్రోజన్, హీలియం మాత్రమే ఉన్నాయని పరిశోధకుల చెబుతున్నారు.ఇంజనీరింగ్ వదిలేసి ఖగోళశాస్త్రంలోకి హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన రోహన్ నాయుడు మొదట ఇంజినీరింగ్‌లో చేరారు. కానీ అది పెద్దగా ఆసక్తి అనిపించకపోవటంతో ఆ చదువును మధ్యలోనే వదిలేశారు. అలా 18 ఏళ్ల వయసులో సింగపూర్‌లోని యేల్-ఎన్‌యూఎస్ కాలేజీలో చేరారు. అక్కడ ఖగోళశాస్త్రంపై మక్కువ పెంచుకున్నారు. ఆ తర్వాత అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చేరారు. 2022లో ఖగోళశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. బిగ్ బ్యాంగ్ తర్వాత విశ్వంలో ఏర్పడిన తొలి గెలాక్సీలపై ఆయన పరిశోధనలు చేస్తున్నారు.

# కోకాపేటలోని నివాసంలో హరీశ్ రావు హౌస్ అరెస్ట్

**సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆసుపత్రి సందర్శనకు పిలుపునిచ్చిన హరీశ్ రావు**

**ముందస్తు జాగ్రత్త చర్యగా హరీశ్ రావును గృహ నిర్బంధం చేసిన పోలీసులు**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు**



మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావును పోలీసులు కోకాపేట్‌లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆయన ఇంటి నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు.ఈ పర్యటన పిలుపు నేపథ్యంతో తెల్లవారుజాము నుంచే కోకాపేట్‌లోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. హరీశ్ రావు ఇల్లు విడిచి బయటకు రాకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో వాతావరణం వేడెక్కింది. ఈ ఆకస్మిక పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా... హరీశ్ రావు హౌస్ అరెస్ట్ వార్త తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షికి బెయిల్ అయినా జైలులోనే

**వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షికి ఒక కేసులో బెయిల్ . హత్యాయత్నం కేసులో ఊరట కల్పించిన కోర్టు**

**బెయిల్ వచ్చినా జైలు నుంచి విడుదల కాని వైనం . కర్నూలు జైలులోనే కొనసాగుతున్న విరూపాక్షి**

**మొత్తం మూడు కేసుల్లో ఒకదానిలోనే బెయిల్ మంజూరు**



వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షికి న్యాయస్థానంలో స్వల్ప ఊరట లభించింది. ఆయనపై నమోదైన మూడు కేసుల్లో ఒకటైన హత్యాయత్నం కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఇతర కేసుల్లో ఇంకా బెయిల్ రాకపోవడంతో ఆయన జైలు నుంచి విడుదల కాలేదు. ప్రస్తుతం విరూపాక్షి కర్నూలు కారాగారంలోనే రిమాండ్‌లో ఉన్నారు. ఈ హత్యాయత్నం కేసులో మొత్తం 35 మందిని నిందితులుగా చేర్చగా, వారిలో ఎమ్మెల్యేతో సహా 28 మందికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది.ఇటీవల కర్నూలు జిల్లా చిప్పగిరిలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ గొడవలో ఎమ్మెల్యే విరూపాక్షి, ఆయన అనుచరులు తనపై దాడి చేసి, కారును ధ్వంసం చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు పురుషోత్తం ఆరోపించారు. ఇదే ఘటనలో సుచిత్ర అనే దళిత మహిళపై కూడా దాడి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి.ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యేపై హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. హత్యాయత్నం కేసులో బెయిల్ లభించినప్పటికీ, అట్రాసిటీ కేసు పెండింగ్‌లో ఉండటంతో ఆయన ప్రస్తుతం జైలులోనే ఉండాల్సి వస్తోంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com